శిథిలావస్థలో కాలువలు

- విరిగిన షట్టర్లు
- రైతులకు అందని సాగునీరు


తూములకు అడ్డంగా పడి ఉన్న షట్టర్లు


శిథిలావస్థకు చేరిన తూము

నందిపేట్(ఆర్మూర్): రైతులకు సాగునీరు అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం కోట్లాది రూపాయలు వెచ్చించి ప్రాజెక్టుల నిర్మాణం చేపడుతోంది. అదే ప్రభుత్వం పంట పొలాలకు నేరుగా సాగునీరు అందించేందుకు నిర్మించిన కాలువలు, తూములకు మరమ్మతులు చేయించడానికి నిధులు మంజూరు చేయడం లేదు. దీంతో తూములు, కల్వర్టులు, కాలువలు శిథిలావస్థకు చేరుకున్నాయి. ప్రధాన కాలువల్లో పిచ్చి మొక్కలు పెరిగిపోయి నీరు దిగువకు చేరకుండా అడ్డు పడుతున్నాయి. అంతే కాకుండా షట్టర్లు విరిగిపోవడం, మరికొన్నింటిని దొంగలు ఎత్తుకెళ్లడంతో నీరు వృథాగా పోతోంది. కాల్వ నిర్మాణం చేపట్టి సంవత్సరాలు గడుస్తున్నా మరమ్మతులు చేపట్టకపోవడం ఆశ్చర్యకరం. ప్రధాన కాలువలే కాకుండ పంట పొలాలలకు సాగునీరు అందించడానికి పిల్ల కాలువలు సైతం ఏర్పాటు చేశారు. అవి సైతం ఆనవాళ్లు కోల్పోయాయి. మరమ్మతుల కోసం ప్రజాప్రతినిధులు, అధికారుల చుట్టూ తిరిగినా ఫలితం లేకుండా పోతుందని రైతులు వాపోతున్నారు. నందిపేట మండలం పరిధిలో డిస్ట్రిబ్యూటరీ కెనాల్–74(ప్రధాన కాలువ) 19 కిలోమీటర్ల పొడవున ఉంటుంది. దీనికి 11 సబ్ డిస్ట్రిబ్యూటరీలు ఉన్నాయి. నాలుగింటికి మాత్రమే షట్టర్లు ఉన్నాయంటే నమ్మండి. ఈ ప్రధాన కాలువ ద్వారా నందిపేట, మాక్లూర్ మండలాల్లోని సుమారు 26 గ్రామాలకు సాగునీరు అందించాలి. కాని ప్రతి ఏడు నందిపేట మండలంలోని ఆంధ్రానగర్, వెల్మల్, అయిలాపూర్, కంఠం గ్రామాలకు మాత్రమే నీరు చేరుతుంది. నిజాంసాగర్ ప్రధాన కాలువలు, పిల్లతూములు, తూములు, షట్టర్లకు మరమ్మతులు కాగితాలకే పరిమితమయ్యాయి. ప్రధాన కాలువతో పాటు 82 డిస్ట్రిబ్యూటరీ కాలువల జంగల్ కటింగ్, తూముల మరమ్మతులు, ఇసుక మేటల తొలగింపు పనులను చేపట్టి సాగునీరు అందించాలని రైతులు కోరుతున్నారు.

అడ్డంకులు తొలగించాలి

నిజాంసాగర్ ప్రధాన కాలువతో పాటు డిస్ట్రిబ్యూటరీలు, తూములు, షట్టర్లు, కాలువ కట్టలకు పడ్డ గండ్లు, లీకేజీల కోసం ఇరిగేషన్ అధికారులు విడతల వారిగా నిధులు మంజూరు చేయాలి. సాగు నీటి సరఫరాకు అడ్డంకులు తొలగించాలి. – శక్కరి, రైతు, బజార్‌కొత్తూర్

మరమ్మతులు చేపట్టాలి

నిజాంసాగర్ కాలువలకు మరమ్మతులు చేపట్టాలి. కాల్వలకు సీసీ లైనింగ్ చేయడంతో పాటు లీకేజీలను సరి చేయాలి. చివరి ఆయకట్టు వరకు నీరందించాలి. నీటి సరఫరా చేసేందుకు నియమించిన గ్యాంగ్‌మెన్‌ల విధులు సక్రమంగా నిర్వహించేటట్లు చర్యలు తీసుకోవాలి.
– ఉమ్మెద ఊశన్న, రైతు, నందిపేట

క్లుప్తంగా

రాష్ట్ర ఈసీ మెంబర్‌గా తిరుపతి ఎన్నిక



భీమ్‌గల్: ఉపాధి కల్పన, శిక్షణ శాఖ రాష్ట్ర టీఎస్‌జీవోఎస్ ఉద్యోగ సంఘం ఎన్నికల్లో రాష్ట్ర ఈసీ మెంబర్‌గా భీమ్‌గల్ ఐటీఐలో విధులు నిర్వహిస్తున్న భూక్య తిరుపతి బుధవారం ఎన్నికయ్యారు. భూక్య తిరుపతి మాట్లాడుతూ.. రాష్ట్ర ఈసీ మెంబర్‌గా నియమించిన రాష్ట్ర అధ్యక్షులకు కృతజ్ఞతలు తెలిపారు. భీమ్‌గల్ ఐటీఐ కళాశాల యాజమాన్యం తిరుపతిని సన్మానించింది. ప్రిన్సిపల్ శ్రీనివాస్ రావ్, సీనియర్ అసిస్టెంట్ సృజన్, నిశాంత్, ప్రవీణ్, సునీల్, సాయి పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ అప్పగింత

రెంజల్(బోధన్): పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ట్రేస్ చేసి మంగళవారం బాధితురాలికి అందించినట్లు ఎస్సై ఉదయ్‌కుమార్ తెలిపారు. తాడ్‌బిలోలికి చెందిన పూజిత తన ఫోన్‌ను పోగొట్టుకుని స్థానిక మీ–సేవలో ఫిర్యాదు చేసినట్లు వివరించారు. సాంకేతికత ఆధారంగా గుర్తించి అందించినట్లు వివరించారు. సీఈఐఆర్ ఆపరేటర్ గణేశ్ పాల్గొన్నారు.

జిల్లా స్థాయిలో ప్రతిభ చూపడం అభినందనీయం



ఆర్మూర్: ఆర్మూర్ పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులు జిల్లా స్థాయి అథ్లెటిక్స్‌లో ప్రతిభ చూపి విజేతలుగా నిలవడం అభినందనీయమని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వనజారెడ్డి అన్నారు. నిజామాబాద్ రాజారాం స్టేడియంలో మంగళవారం నిర్వహించిన తొమ్మిదవ సబ్ జూనియర్ జిల్లా స్థాయి అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో 14 సంవత్సరాల లోపు బాలికల విభాగం 100 మీటర్ల పరుగు పందెంలో తమ పాఠశాలకు చెందిన పి.శ్రావణి రెండో స్థానం, ఎస్. రిషిక మూడో స్థానంలో నిలిచి బహుమతులు అందుకున్నారన్నారు. ఈ సందర్భంగా పీడీ గోపిరెడ్డిని, గెలుపొందిన క్రీడాకారినులను అభినందించారు.

'గోరుముద్ద' ప్రారంభం

రుద్రూర్: పోతంగల్ మండలం కారేగాం హైస్కూల్‌లో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు మంగళవారం గోరుముద్ద కార్యక్రమంలో భాగంగా ఆచన్‌పల్లి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అల్పాహారం అందజేశారు. 40 రోజుల పాటు కొనసాగే ప్రత్యేక తరగతులకు హాజరయ్యే విద్యార్థులకు అల్పాహారం అందించనున్నట్టు లయన్స్ క్లబ్ ప్రతినిధులు వెల్లడించారు. తొలి రోజు పండ్లు, బిస్కట్లు, వివిధ రకాల స్నాక్స్ అందించారు. స్కూల్ హెడ్‌మాస్టర్ దుర్గారావ్, లయన్స్ రీజనల్ చైర్మెన్ శివనాగేశ్వరావ్, లయన్స్ క్లబ్ ప్రతినిధులు చక్రవర్తి, వెంకటేశ్వరరావ్, రామకృష్ణ, గాంధీ పాల్గొన్నారు.

పరీక్ష ప్యాడ్‌ల పంపిణీ

రెంజల్(బోధన్): వీరన్నగుట్ట ప్రభుత్వ పాఠశాలకు చెందిన పదవ తరగతి విద్యార్థులకు మంగళవారం కీర్తన సొసైటీ ఆధ్వర్యంలో పరీక్షా ప్యాడ్‌లు, స్కేల్‌లను పంపిణీ చేశారు. సొసైటీ వ్యవస్థాపకుడు ప్రణయ్ రాజ్ తండ్రి ఎర్ర జార్జ్ ద్వితీయ వర్ధంతి సందర్భంగా పాఠశాలలోని 40 మంది విద్యార్థులకు అందించారు. మండల నోడల్ అధికారి ఆంజనేయులు, దూపల్లి, వీరన్నగుట్ట హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు గణేశ్‌రావ్, తదితరులు పాల్గొన్నారు.

సమ్మె నోటీసు అందజేత

బోధన్‌టౌన్(బోధన్): ఈ నెల 16న నిర్వహించనున్న దేశవ్యాప్త సమ్మెలో అంగన్‌వాడీలు పాల్గొంటున్నట్లు తెలుపుతూ మంగళవారం సీడీపీవో కార్యాలయంలో సీఐటీయూ నాయకులు సమ్మె నోటీసును అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు శంకర్‌గౌడ్ మాట్లాడారు. సమ్మె నోటీసు అందించిన వారిలో బోధన్ ప్రాజెక్టు అధ్యక్షురాలు మంగాదేవి, కార్యదర్శి విక్టోరియా రాణి, సభ్యులు రేణుక, లావణ్య, పద్మా ఉన్నారు.

వర్నిలో.. 'మధ్యాహ్న భోజన' కార్మికులు
వర్ని: ఈ నెల 16న దేశవ్యాప్త సమ్మెలో తాము కూడా పాల్గొంటామని వర్ని మండల మధ్యాహ్న భోజన ఏజెన్సీ కార్మికులు మంగళవారం వర్ని ఎంఈవోకు తెలుపుతూ సమ్మె నోటీసు అందజేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, కర్షక, ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా సమ్మెలో పాల్గొంటామని నోటీసులో పేర్కొన్నారు. సబిత, అంజలి, మేఘన, స్వర్ణ, సుజాత, శ్యామల, లావణ్య పాల్గొన్నారు.

బాగా కష్టపడి చదవాలి

ఎడపల్లి(బోధన్): బాగా కష్టపడి చదివాలని, పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరుతేవాలని డీఈవో దుర్గప్రసాద్, విద్యార్థులకు సూచించారు. మంగళవారం ఎడపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల(తెలుగు మీడియం పాఠశాల)ను ఆయన మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు. ఉపాధ్యాయుల హాజరు, విద్యార్థుల ఎన్రోల్మెంట్, అటెండెన్స్ వివరాలు వంటి వాటిని హెచ్ఎం సాయిలును అడిగి తెలుసుకున్నారు.

'పల్లెకు పోదాం కార్యక్రమం'


సమస్యలు తెలుసుకుంటున్న బీజేపీ నేతలు

నందిపేట్(ఆర్మూర్): సీహెచ్ కొండూర్‌లో బీజేపీ ఆధ్వర్యంలో గావ్ చలో(పల్లెకు పోదాం) కార్యక్రమాన్ని నిర్వహించారు. జీపీ కార్యాలయానికి వెళ్లి సమస్యలను తెలుసుకున్నారు. గ్రామంలో దోమల బెడద ఎక్కువగా ఉందని, పాఠశాలలో మరుగుదొడ్లు సరిపడా లేనట్లు గుర్తించామని, సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులకు విన్నవిస్తామని బీజేపీ నాయకులు తెలిపారు. అనంతరం కేంద్ర ప్రభుత్వం చేపట్టిన వివిధ పథకాల గురించి స్థానిక యువకులతో చర్చించారు. బీజేపీ నాయకులు గాండ్ల నర్సాగౌడ్, నాగ సురేష్, నాగేశ్వర్, గంగాధర్, మహేందర్, నర్సయ్య, సాయికుమార్, రాకేష్, భూమేష్, కిషన్, తదితరులు పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని జయప్రదం చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ బాగయ్య

బోధన్‌టౌన్(బోధన్): బోధన్ పట్టణ నడిబొడ్డు చావిడి వద్ద గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవంలో గ్రామ ప్రజలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వీడీసీ చైర్మన్ సింగం బాగయ్య యాదవ్ కోరారు. మంగళవారం బోధన్‌లో వీడీసీ సమావేశం నిర్వహించారు. విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవ కార్యక్రమం ఈ నెల 29, మార్చి 1, 2 తేదీల్లో నిర్వహించనున్నామని తెలిపారు. సమావేశంలో వీడీసీ కమిటీ ప్రతినిధులు జెల్లా సూర్యప్రకాష్ రెడ్డి, బీర్కూర్ శంకర్, కోంద్ర వెంకటి, వీరయ్య, తదితరులున్నారు.

బాల్క సుమన్ వెంటనే క్షమాపణలు చెప్పాలి


మోస్రాలో బాల్క సుమన్ దిష్టిబొమ్మ దహనం


ఆర్మూర్ పట్టణంలో..

సాక్షి నెట్‌వర్క్ : తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డిని బీఆర్ఎస్ నేత, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ చెప్పుతో కొడతా అంటూ అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు భగ్గుమన్నారు. జిల్లా వ్యాప్తంగా బాల్క సుమన్ దిష్టిబొమ్మలను దహనం చేసి నిరసనలు తెలిపారు. ఆయనపై చర్యలు తీసుకోవాలంటూ పోలీస్‌స్టేషన్లలో ఫిర్యాదు చేశారు. సీఎం రేవంత్ రెడ్డిని విమర్శించే స్థాయి నీది కాదని, ఉద్యమాన్ని అడ్డం పెట్టుకుని తెలంగాణాను దోచుకున్న చరిత్ర బీఆర్ఎస్ పార్టీ నాయకులదని స్థానిక కాంగ్రెస్ నేతలు విమర్శించారు. బాల్క సుమన్ వెంటనే క్షమాపణ చెప్పాలని, లేకుంటే రాష్ట్రంలో ఎక్కడా తిరగనీయమని హెచ్చరించారు.


భీమ్‌గల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు

ప్రశాంత్ రెడ్డి నోరు అదుపులో పెట్టుకోవాలి


కమ్మర్‌పల్లిలో ప్రశాంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కమ్మర్‌పల్లి: బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి నోరు అదుపులో పెట్టుకోవాలని కమ్మర్‌పల్లి మండల కాంగ్రెస్ నాయకులు హెచ్చరించారు. సోమవారం జరిగిన బీఆర్ఎస్ సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డిపై ప్రశాంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ మంగళవారం కమ్మర్‌పల్లిలో ఆయన దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ప్రజలను నిలువునా దోచుకున్న ప్రశాంత్‌రెడ్డికి సీఎం రేవంత్‌రెడ్డిని విమర్శించే అర్హత లేదన్నారు. ప్రజల మన్ననలతో సీఎం అయిన రేవంత్‌రెడ్డి కాలి దూలికి ప్రశాంత్‌రెడ్డి సరిపోడని విమర్శించారు. ఒళ్లు దగ్గర పెట్టుకొని మాట్లాడాలని హితవు పలికారు.

రేవంత్‌ను విమర్శించే స్థాయి కాదు
వేల్పూర్: సీఎం రేవంత్‌రెడ్డిని విమర్శించే అర్హత బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డికి లేదని వేల్పూర్ మండల కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గడ్డం నర్సారెడ్డి, నాయకులు పన్నాల రాజేశ్వర్, నరేందర్, రాజేందర్, రాము,రమణ, మాజిద్, నర్సయ్య, చరణ్, గంగారెడ్డి తదితరులు మంగళవారం వేల్పూర్‌లో విలేకరులతో మాట్లాడారు. అధికారం పోయిందన్న ఆవేశ ంతో బీఆర్ఎస్ నాయకులు ఏది పడితే అది మాట్లాడుతున్నారని విమర్శించారు.

దరఖాస్తుల సవరణకు సర్వే బృందాలు

సుభాష్‌నగర్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'మహాలక్ష్మి' పథకంలో ప్రజలు సమర్పించిన దరఖాస్తులలో తప్పిదాలు ఉంటే, వాటిని సవరించేందుకు వీలుగా ప్రత్యేక సర్వే బృందాలను నియమించినట్లు కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు మంగళవారం తెలిపారు. ఈ బృందాలు నేటి నుంచి సర్వే చేపడతాయని అన్నారు. మహాలక్ష్మి పథకం కింద వంట గ్యాస్ సిలిండర్ రూ. 500 లకే అందించాలని ప్రభుత్వం సంకల్పించిన నేపథ్యంలో ప్రజల నుంచి ప్రజాపాలన కార్యక్రమంలో దరఖాస్తులు స్వీకరించడం జరిగిందన్నారు. అయితే ఈ దరఖాస్తులలో పలువురు సమగ్ర వివరాలను పేర్కొనలేదని గ్యాస్ ఏజెన్సీ పేరు, గ్యాస్ నెంబర్, రేషన్ కార్డు నెంబర్ వంటి వివరాలను దరఖాస్తులలో సరిగా పొందుపర్చలేదని తెలిపారు. అలాంటి దరఖాస్తుదారుల వివరాలను సరి చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక యాప్‌ను రూపొందించిందని తెలిపారు. సర్వే బృందాలు దరఖాస్తుదారులను సంప్రదించి ఈ యాప్ సహాయంతో వివరాలను సరి చేస్తుందని సూచించారు. సర్వే బృందాలు సంప్రదించలేదని, ఇతర దరఖాస్తుదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కలెక్టర్ సూచించారు.

8న కార్మిక ర్యాలీ

మాక్లూర్: పరిశ్రమల్లో పనిచేసే ప్రతి కార్మికుడికి కనీస వేతనంగా రూ.26 వేల వేతనం వర్తింపజేయాలనే డిమాండ్‌తో ఈ నెల 8న చేపట్టిన ర్యాలీ కార్యక్రమానికి కార్మికులందరూ తరలిరావాలని ఐఎఫ్‌టీయు జిల్లా సహాయ కార్యదర్శి దుడ్డు గంగాధర్ కోరారు. మంగళవారం మాణిక్ బండారు చౌర స్తా వద్ద ఆయన మాట్లాడారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తూ, ప్రస్తుతం పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. లేబర్ కోడ్స్‌ను రద్దు చేసి పాత పెన్షన్‌ను పునరుద్ధరించాలన్నారు. ఈనెల 28న హైదరాబాద్‌లో జరిగే భారీ ర్యాలీకి కార్మికులందరూ హాజరై విజయవంతం చేయాలని కోరారు.నాయకులు శివరా జ్, సురేష్, లక్ష్మణ్, సుమన్ పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగుల సేవలు మరువలేనివి


డైరీ ఆవిష్కరిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ వినీత

ఆర్మూర్: నిరంతరం ప్రజలకు విద్యుత్ సరఫరా అందించడంలో ఆ శాఖ ఉద్యోగులు అందిస్తున్న సేవలు మరువలేనివని ఆర్మూర్ మున్సిపల్ చైర్ పర్సన్ పండిత్ వినీత అన్నారు. ఆర్మూర్ మున్సిపల్ కార్యాలయంలో విద్యుత్ శాఖ లైన్‌మెన్ 327 యూనియన్ డైరీని మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ లైన్‌మెన్‌లు పాల్గొన్నారు.


అభినందిస్తున్న మహిళా సంఘాల సభ్యులు

మహిళలకు సముచిత స్థానం

ఆర్మూర్: ఆర్మూర్ మున్సిపల్ చైర్ పర్సన్ పండిత్ వినీత హయాంలో మహిళలకు సముచిత స్థానం లభిస్తోందని క్షత్రియ సమాజ్ మహిళా సంఘం సభ్యులు అభిప్రాయపడ్డారు. ఆర్మూర్ పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో ఆమెను మంగళవారం కలిసి అవిశ్వాస తీర్మానం వీగిపోయినందుకు శుభాకాంక్షలు తెలిపారు.

'ప్రజా ఉద్యమాలపై దుర్మార్గంగా ప్రవర్తిస్తున్నారు'



నిరసన తెలుపుతున్న ప్రజాపంథా నేతలు

ఆర్మూర్: ఖమ్మం పోలీసు కమిషనర్ సునీల్ దత్ తన అనుచిత వ్యాఖ్యలతో ప్రజా ఉద్యమాలతో పాటు ఉద్యమకారుల పట్ల దుర్మార్గంగా ప్రవర్తిస్తున్నారని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా నేత ప్రభాకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆర్మూర్ పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో ప్రజాపంథా ఆధ్వర్యంలో సీపీ సునీల్ దత్ దిష్టిబొమ్మను దహనం చేసి మంగళవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇటీవల ప్రజాపంథా రాష్ట్ర నాయకులు ఆవుల అశోక్, సీవై పుల్లయ్యలను రౌడీ షీటర్లు అని పేర్కొంటూ సీపీ సునీల్ కేసులు నమోదు చేయడాన్ని వారు తప్పుబట్టారు. రౌడీషీట్ తొలగించాలని డిమాండ్ చేశారు. నాయకులు దేవరాం, రామకృష్ణ, ముత్తన్న, సురేష్, కిషన్, తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత విద్యతోనే బంగారు భవిష్యత్తు

- పాఠశాలల్లో మౌలిక వసతులు ఏర్పాటు చేస్తాం
- బోధన్ ఎమ్మెల్యే పొద్దుటూరి సుదర్శన్‌రెడ్డి


విద్యార్థినిని అభినందిస్తున్న బోధన్ ఎమ్మెల్యే


అధికారితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి

రెంజల్(బోధన్): ప్రభుత్వ పాఠశాలల్లో చదివే నిరుపేద విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని చదువుల్లో రాణించి భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలని బోధన్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి పొద్దుటూరి సుదర్శన్‌రెడ్డి సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులకు అవసరమైన మౌలిక వసతులను కల్పించేందుకు నిర్ణయించినట్లు పేర్కొన్నారు. కందకుర్తి, పేపర్‌మిల్, నీలా గ్రామాల్లో ఎమ్మెల్యే మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా నీలా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులతో ఆయన ముచ్చటించారు. విద్యా రంగాన్ని అభివృద్ధి చేసేందుకు తన వంతు ప్రోత్సాహం అందిస్తానని, ఉపాధ్యాయులు కూడా తమ పిల్లలే అనుకుని నిరుపేద విద్యార్థులను తీర్చిదిద్దాలని సూచించారు. వసతులకు అవసరమైన నిధులను అందిస్తానని తెలిపారు.

నీలా పాఠశాల ఆవరణలోని పాత గుంతను పూడ్చేందుకు రూ.4 లక్షలు, మొరం పనులకు రూ. 2 లక్షలు, బాత్‌రూముల నిర్మాణాలకు రూ.6 లక్షలు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. పేపర్‌మిల్ గ్రామంలో తాగునీటి అవసరాలకు రూ.6 లక్షలు, మొరం రోడ్డు నిర్మాణ పనులకు రూ.2 లక్షలు మంజూరు చేశారు. కందకుర్తి ప్రభుత్వ పాఠశాలలో వసతుల ఏర్పాటుకు రూ. 10 లక్షల నిధులను మంజూరు చేశారు.

నర్సింగ్ కళాశాలకు స్థలం పరిశీలన
బోధన్‌టౌన్(బోధన్): బోధన్ జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో కొనసాగుతున్న నర్సింగ్ కళాశాల కోసం పట్టణ శివారులోగల ఎస్‌ఎస్‌ఎఫ్ స్థలాన్ని మంగళవారం ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి పరిశీలించారు. పట్టణ శివారు ప్రాంతంలోని శ్రీదర్శనం ఎదురుగా ఉన్న ఎస్ఎస్ఎఫ్ భూమి ఎంత ఉందని ఆర్డీవో రాజాగౌడ్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. 10 ఎకరాల స్థలం అనువుగా ఉంటే నర్సింగ్ కళాశాల నిర్మాణం చేపట్టేందుకు చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డి, నాయకులు తాహెర్‌బిన్ హుందాన్, కౌన్సిలర్ శరత్ రెడ్డి, తదితరులు ఉన్నారు.

నిజామాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్‌దే

త్వరలో జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో నిజామాబాద్‌లో కాంగ్రెస్ జెండా ఎగురవేస్తామని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ప్రతీ ఒక్కరు సైనికుల్లా పని చేయాలని కార్యకర్తలు, నాయకులకు సూచించారు. కాంగ్రెస్ పార్టీలో చేరే వారికి స్వాగతం పలకాలని స్థానిక నాయకులకు వివరించారు. నాయకులు మొబిన్‌ఖాన్, ధనుంజయ్, గయాసోద్దిన్, సాయరెడ్డి, రాములు, జావీద్, మర్ల రమేశ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్మూర్ అభివృద్ధికి కృషి చేస్తా

- కాంగ్రెస్ పార్టీ ఆర్మూర్ ఇన్‌చార్జి పొద్దుటూరి వినయ్ రెడ్డి



ఆర్మూర్: తాను ఓడిపోయినా తమ పార్టీ రాష్ట్రంలో అధికారంలో ఉంది కాబట్టి ఆర్మూర్ అభివృద్ధికి కృషి చేస్తానని కాంగ్రెస్ పార్టీ ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి పొద్దుటూరి వినయ్ కుమార్ రెడ్డి అన్నారు. ఆర్మూర్ పట్టణంలో ఆయన మాట్లాడారు. ప్రెస్ క్లబ్ సభ్యులు తమ సమస్యలను వినయ్ రెడ్డికి తెలపగా జర్నలిస్టుల సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ నాయకులు సాయిబాబా గౌడ్, జిమ్మి రవి, మురళిలు తదితరులున్నారు.

'సమస్యల పరిష్కారంలో కేంద్రం విఫలం'

ఆర్మూర్: పదేళ్ల కాలం పాటు అధికారంలో ఉన్నా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో విఫలమైందని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు ముత్తన్న ఆరోపించారు. ఆర్మూర్ పట్టణంలోని కుమార్ నారాయణ భవన్‌లో సోమవారం ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ విధానాలను ఎండగడుతూ ఈ నెల 16న దేశవ్యాప్తంగా బంద్‌ను నిర్వహించాలని సంఘాలు నిర్ణయం తీసుకున్నాయన్నారు. బంద్‌ను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఐఎఫ్‌టీయూ నాయకులు గుండారం సాయిరెడ్డి, రవి, అబ్బాల్, రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నులి పురుగు నివారణ మాత్రలు వేయాలి


మాట్లాడుతున్న సీడీపీవో జానకమ్మ

బోధన్‌టౌన్(బోధన్): బోధన్ సీడీపీవో పరిధిలో పిల్లలందరికి నులి పురుగుల నివారణ మాత్రలు తప్పకుండా వేయాలని సీడీపీవో జానకమ్మ సూచించారు. మంగళవారం పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అంగన్‌వాడీ టీచర్లకు నులి పురుగుల నివారణ మాత్రల పంపిణీపై శిక్షణ కార్యక్రమం నిర్వహించి సీడీపీవో మాట్లాడారు. ఈ మాత్రలు వేయడం వల్ల పిల్లల కడుపులో ఉన్న నులి పురుగులను నివారించవచ్చని తెలిపారు. పిల్లల్లో రక్తహీనత తగ్గుతుందన్నారు. ఏడాది నుంచి 2 సంవత్సరాల పిల్లలకు సగం మాత్ర వేయాలని, రెండు నుంచి 19 ఏళ్ల వారికి ఒక మాత్ర వేస్తామని అన్నారు. అంగన్‌వాడి సెంటర్లలో ఒక రోజు ముందే పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తామన్నారు. సూపర్ వైజర్‌లు రాధిక, భారత లక్ష్మి లు ఉన్నారు.

ప్రభుత్వ భూములకు సరిహద్దులు ఏర్పాటు చేయాలి



బాల్కొండ: మండల కేంద్రంలోని ప్రభుత్వ భూములకు వెంటనే సరిహద్దులను ఏర్పాటు చేయాలని ఆర్మూర్ ఆర్డీవో వినోద్ ఆదేశించారు. మంగళవారం బాల్కొండ తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సర్వే నంబరు–1333లో భూమిని వెంటనే సర్వే చేయాలన్నారు. దానికోసం ప్రత్యేకంగా నలుగురు సర్వేయర్లను కేటాయించారన్నారు. త్వరలోనే హద్దులు ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారని తెలిపారు. ఆయనవెంట తహసీల్దార్ శ్రీధర్, సిబ్బంది ఉన్నారు.

సినిమాలు తెలుగు/హిందీ/ఇంగ్లీష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

స్క్రీన్-1 –	హ్యాపీ ఎండింగ్ – 12.05, 6.20 బూట్‌కట్ బాలరాజు (తెలుగు) – 3.15 ధీర (తెలుగు) – 9.30
స్క్రీన్-2 –	హనుమాన్ (తెలుగు) – 02.40, 6.00, 9.20
స్క్రీన్-3 –	అంబాజీపేట మ్యారేజీ బ్యాండు– 10.35, 1.30, 4.25, 7.20, 10.15
స్క్రీన్-4 –	ధీర (తెలుగు) – 01.20 కిస్మత్ (తెలుగు) – 4.00, 9.50 గేమ్ ఆన్ (తెలుగు) – 6.50

'కార్మిక వ్యతిరేక విధానాలను మానుకోవాలి'

బోధన్ రూరల్ (బోధన్): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, బీడీ కార్మిక వ్యతిరేక విధానాలను మానుకోవాలని తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్(ఐఎఫ్‌టీయూ) జిల్లా ఉపాధ్యక్షుడు బి.మల్లేశ్ డిమాండ్ చేశారు. మంగళవారం ఎరాజ్‌పల్లి గ్రామంలో బీడీ కార్మికులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అనుసరిస్తున్న విధానాల మూలంగా బీడీ పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికులు తీవ్రమైన ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని అన్నారు. గతంలో బీడీ కార్మికులకు ఉన్న సంక్షేమ పథకాలను రద్దుచేసి ఇబ్బందులపాలు చేశారన్నారు. సమావేశంలో అనసూయ, లక్ష్మక్క, ఈశ్వరి, సాయక్క, లలిత, గంగామణి పాల్గొన్నారు.

14న బహిరంగ వేలం

బోధన్‌టౌన్(బోధన్): పట్టణంలోని మారుతి మందిరం పరిధిలోని దుకాణం నెం–1కు దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో బహిరంగ లైసెన్స్ వేలం నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో రవీందర్ గుప్తా తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన చేశారు. ఈ బహిరంగ వేలంలో పాల్గొనే వారు దరఖాస్తు ఫారం పూర్తి చేసి ఇవ్వాలని, వేలం పాట ముందు రోజు ధరావతుగా రూ.2 లక్షలు డిపాజిట్ చేయాలని తెలిపారు.